అది ఒక టౌన్.

ఆ టౌన్‌లో ఒక చిన్న సాహితీ సంస్థ. పేరు "మలయమారుతం". సుమారు మూడేళ్ల క్రితం స్థాపించబడింది. ఆ సంస్థకు రాజన్న అధ్యక్షుడు, సుబ్బారావు కార్యదర్శి.

ఇళ్లల్లో టీవీ ప్రోగ్రామ్‌లు చూసి చూసి విసుగెత్తిన ప్రేక్షకమహాశయులు మలయమారుతం సాహిత్య సంస్థ "ఎడారిలో ఒయాసిస్సు లాంటి"



దని మురిసిపోయారు. "పనసకాయ దొరికింద ని తద్దినం పెట్టినట్టు వుంటున్నాయి సంస్థ కార్య క్రమాలు" అనుకున్నారు వూళ్లోని జనం. "ఈ కార్యక్రమాల కన్నా టీవీలో ఏళ్లతరబడి వచ్చే ఎపిసోళ్లే నయం" అనుకున్నారు మరికొంత మంది తెలివిజనులు.

వూళ్లో అయిదారుగురు చిరుకవులు వున్నా రు. సంస్థ అధ్యక్షుడు రాజన్న పద్యాలు బాగా రాస్తాడు. అతగాడికి కథలు, కాకరకాయలు అంటే అట్టే ఇష్టం వుండదు. అయినా "కథావా హిని" పేరుతో ఒకటి రెండు కార్యక్రమాలు నిర్వహించాడు కూడా.

అవి కూడా పనసకాయ... సామెతగానే ఉన్నాయి అని చప్పరించారు సాహిత్యాభిమాను లు కొంతమంది. మరికొంతమంది మాత్రం "బొత్తిగా నదులూ సముద్రాలూ ఇంకిపోతున్న ఈ రోజుల్లో సాహితీ ఎడారిలో కథావాహిని ఇంకా సన్నగా ప్రవహిస్తోంది అంటే... అది రాజన్న, సుబ్బారావుల గొప్పతనం" అని చంక లు గుద్దుకున్నారు. వాళ్లెవరయ్యా అంటే... ఒక టి రెండు చిన్నా చితకా కథలు రాసినవాళ్లు, ఒకటి రెండుసార్లు వేదిక ఎక్కే అవకాశం పొం దిన భజనపరులు!

అయినా ఒక ప్రాచీన కవిగారు సెలవిచ్చి నట్టు "నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు" అన్న వైఖరితో అదరక, బెదరక సంస్థ అప్పుడప్పుడూ సాహితీకార్యక్రమాలు చేస్తూనే వుంది! మేము ఏ కార్యం తలపెట్టినా అది ఘనకార్యమే అన్న రీతిలో!

మోహనరావు స్కూలు టీచరు. ఒక నెల క్రితం ఆ వూరికి ట్రాన్స్‌ఫర్ మీద వచ్చాడు. వచ్చిన కొద్ది రోజులలోనే స్కూలు పిల్లలకు సన్ని హితుడయ్యాడు. అతగాడు చిన్న రచయిత. మోహనరావు రాసిన కొన్ని కథలు, కవితలు వివిధ పత్రికలో వచ్చాయి కూడా!

గత ఏడాది నుండే మోహనరావుకి తన కథలన్నిటినీ ఒక సంపుటిగా పుస్తకరూపంలో చూసుకోవాలన్న కోరిక మొదలయింది. అది చిరుగాలిలా మొలకెత్తి పెనుగాలిలా విజృంభిం చి, బంగాళాఖాతంలో వాయుగుండంలా బల పడింది.

ఒకరోజు రాత్రి భోజనాలు చేస్తుండగా మోహనరావు భార్య రంజనితో తన మనసు లోని కోరిక చెప్పాడు.

అందుకు అందంగా నవ్వి అంది రజని "తప్పకుండా కథాసంపుటిగా వేయండి! వూళ్లో మలయమారుతం సాహితీ సంస్థ వుందిగా! వారిని సంప్రదించండి. మీ కథాసంపుటిని వారి సంస్థ వేదికమీద ఆవిష్కరణ జరిపించాలని చెప్పండి!" అని ముగించింది... కరణేషు... అన్న రీతిలో!

భార్య మాటలు మోహనరావు మనసులో మోహనరాగం ఆలపించాయి. ఆ రాత్రి ప్రశాం తంగా నిద్రపోయాడు.

* * *

మర్నాడు ఆదివారం.

మోహనరావు కార్యక్రమాలు పూర్తిచేసుకుని రాజన్న ఇంటికి వెళ్లాడు. రాజన్న ఆప్యాయంగా ఆహ్వానించాడు. మోహనరావు రాజన్నతో తన కథాసంపుటి గురించి చెప్పి, ఆ పుస్తక ఆవిష్కర ణ మలయమారుతం సాహిత్య సంస్థ తరపున జరిపించాలని కోరాడు.

మోహనరావు మాటలు వినగానే రాజన్న ఒక్క క్షణం మోహనరావు మొఖంలోకి హిప్నా టిజం చేసేవాడిలా చూసాడు. మరుక్షణం దర హాసం, మందహాసం, అట్టహాసం, వికటాట్టహా సం చేసాడు. ఆ తరువాత మొదలు పెట్టాడు...

"తప్పకుండా అలాగే చేద్దాం! పుస్తకం అవగానే చెప్పు! కానీ ముందుగా నీకు సంస్థ ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితుల గురించి కొంత వివరించాలి! వివరంగా చెప్పాలి అంటే... అదో పెద్ద పద్యం! (మరొకరు అయితే అదో పెద్దకథ అంటారు! రాజన్న కవి. పద్యాలు రాస్తాడు కనుక అలా అన్నాడు) సాంఘిక, రాజకీయ పరిస్థితులు ఏమీలేవు గానీ ఆర్థిక పరిస్థితి మాత్రం బాగోలేదు!"

"నిధుల కొరతవల్ల శాఖోపశాఖలుగా విస్తరించాల్సిన సంస్థ బొత్తిగా గిడసబారిపోతోంది! అంచేత మూడువేల రూపాయలు నువ్వు పెట్టుకున్నావంటే నీ 'పుస్తకావిష్కరణ సభ' బ్రహ్మాండంగా చేద్దాం! ఏమంటావు?" అన్నాడు!

అన్నట్లు ఆ సభకి ముఖ్య అతిథిని... రాజన్న చెప్పబోతూండగానే, మధ్యలో అందుకున్నాడు మోహనరావు "ఆ విషయం నాకు వదిలేయండి! "ప్రబుద్ధుడుగారు" అని నేను కాలేజీలో చదువుకునే రోజుల్లో మా తెలుగు లెక్చరర్‌గారు! ఆయన్ని పిలుద్దాం!" అన్నాడు మోహనరావు.

ఆ క్షణంలో రాజన్న బుద్ధి కంప్యూటర్ కన్నా వేగంగా పనిచేసింది. ప్రబుద్ధుడుగారు రాజన్న స్మృతిపథంలో తళుక్కున మెరిసారు. ఆయన మంచి వక్త అని విన్నాడు. ఆయన రాసిన రెండు మూడు పుస్తకాలు కూడా చదివాడు తను.

వెంటనే మోహనరావుతో అన్నాడు రాజన్న "చాలా సంతోషం! మరి ఆయనగారు విజయవాడనుంచి రావాలి కదా! రాను పోను ఖర్చులు, వసతి మొదలయినవి నువ్వే ఏర్పాటు చేయాలి. సంస్థ ఆ ఖర్చుని తట్టుకోలేదు కానీ నీకు ఒక శాలువా ప్రబుద్ధుడుగారికి ఒక దళసరి దండ మాత్రం సంస్థ భరిస్తుంది" అన్నాడు.

అన్ని ఖర్చులూ సంస్థ తన మీదకే రుద్దుతున్నందున మనసులో బాధపడినా మంత్రసానితనానికి ఒప్పుకున్నాక... అన్నట్టు పైకి మాత్రం ఆనందంగా అంగీకరించాడు పాపం! మోహనరావు.

రోజులు తామరాకు మీద నీటిబొట్లలా, కన్నెపిల్ల జార్జెట్ జాకెట్ మీద వేసుకున్న సిల్క్ ఓణీలా జారిపోయాయి రెండు నెలలు.

* * *

మోహనరావు "కథ కాని కథలు" అన్న తన కథాసంపుటి పుస్తకాన్ని తీసుకుని రాజన్న ఇంటికి వెళ్లాడు. అక్కడ సంస్థ కార్యదర్శి సుబ్బారావు కూడా వున్నాడు. "ఇదిగోనండీ! పుస్తకం... మీరు ఒక తేదీ నిర్ణయిస్తే, నేను ప్రబుద్ధుడుగారికి తెలియజేస్తాను!" అన్నాడు మోహనరావు సౌమ్యంగా!

ఒక అరగంట తర్జన భర్జనలు జరిపిన పిదప పుస్తక ఆవిష్కరణ తేదీ ఖరారు చేయబడింది.

* * *

వేదిక రంగురంగుల విద్యుత్ బల్బులతో కళకళలాడుతోంది.

మోహనరావు మొఖంలో మరింత కళ తాండవమాడుతోంది. మరో అరగంటలో సభ ప్రారంభం కాబోతోంది అనగా... రాజన్న మోహనరావుతో అన్నాడు.

"చూడు మోహనరావూ! క్రితం నెల స్వర్గస్థులయిన ప్రముఖ కవి పండితులు శ్రీ "రామబాణం"గారు లోగడ మన ఆహ్వానంమీద ఒకటి రెండుసార్లు మన సంస్థలో ఉపన్యసించారు! వారికి ప్రబుద్ధుడుగారు ప్రియతమ శిష్యుడు. ఆయనగారే ఒకసారి చెప్పారు! అన్నీ కలిసొచ్చాయి!"

"అంచేత సభ ప్రారంభించాకా శ్రీ ప్రబుద్ధుడుగారు వారి గురుదేవులు శ్రీ రామబాణం గారి గురించి నాలుగు ముక్కలు చెబుతారు.

మనమంతా రెండు నిమిషాలు మౌనం పాటి ద్దాం! ఈ రకంగా వారి ఆత్మకు శాంతి కలిగిం చినవారమవుతాము... ఏమంటావు?" అన్నాడు.

"అందుకే వూళ్లోవాళ్లంతా మీ కార్యక్రమా నికి పనసకాయ... సామెతగా వున్నాయి అంటా రు. ఆయనగారి ఆత్మశాంతి మాట ఎలా అఘో రించినా, నా మనసుకి శాంతి లేకుండా చేసావు కదా?" అని మనసులో బాధపడ్డాడు మోహన రావు. పైకి మాత్రం చిరునవ్వుతో "అలాగే కానివ్వండి!" అన్నాడు.

మరో పది నిమిషాల్లో సంస్థ కార్యదర్శి సుబ్బారావు చేతిలో ఒక కాగితంతో వేదిక ఎక్కి మైకు ముందు నిలబడ్డాడు.

ముందుగా వూరి ప్రెసిడెంట్ పాపయ్యగా ర్ని, తరువాత ప్రముఖ నేత్రవైద్యులు సుబ్బయ్య గార్ని, వార్డు కౌన్సిలర్ వెంకట్రావుని వేదిక మీదకు ఆహ్వానించాడు. పిదప ప్రెసిడెంట్ బావ మరిది ఈ మధ్య కవిత్వం రాయడం నేర్చుకుం టున్నాడని, శాంపిల్‌గా తను రాసింది చదువు తాడని వేదిక మీదకి ఆహ్వానించాడు. ఆ తరు వాత సంస్థకి ఎక్కువ విరాళం ఇచ్చిన విశిష్ట అతిథి వీర్రాజుగార్ని, ఆపైన మరో ముగ్గురినీ వేదిక మీదకు ఆహ్వానించాడు కార్యదర్శి సుబ్బా రావు. తరువాత నేటి సభకు ముఖ్యఅతిథి శ్రీ ప్రబుద్ధుడు గారిని వేదికనలంకరించాల్సిందిగా కోరాడు.

మోహనరావుకి వళ్లు మండిపోతోంది. "తనతో చెప్పిన మాట ప్రకారం ప్రెసిడెంట్ గార్ని, డాక్టరుగార్ని మాత్రమే వేదిక మీదకు ఆహ్వానిస్తానని చెప్పి ఇంతమందికి పిలుస్తా డా?" అనుకున్నాడు కసిగా.

అంతలో నేటి సభలో పుస్తక రచయిత అయిన శ్రీ మోహనరావుని వేదిక మీదకు రావ ల్సిందిగా కోరుతున్నాను! అన్నాడు చివరిగా సుబ్బారావు.

అది విన్న మోహనరావు ఆదరా బాదరాగా మైకు వైరుని కాళ్లతో తన్నుకుంటూ పడుతూ లేస్తూ కంగారుగా వేదిక ఎక్కాడు. అప్పటి కప్పుడు తనకోసం వేసిన తుప్పుపట్టిన ఫోల్డిం గ్ ఛైర్‌లో కూలబడ్డాడు. సభ ప్రారంభమైంది!

ముందు ప్రెసిడెంట్‌గారు మాట్లాడారు. తను పొలం వెళ్లిపోతూంటే రాజన్నగారు మరీ మరీ బ్రతిమాలారని, అందుకు వచ్చాననీ చెప్పా రు. 'అంతేగాని తను ఇష్టపడి రాలేదు' అనుకు న్నాడు మోహనరావు.

తరువాత కళ్ల డాక్టరుగారు అసలు కళ్లకలక అనే వ్యాధి ఎందుకు వస్తుందో చెప్పారు. కళ్ల జోళ్లు ఎందుకు వాడాలో, ఎలా వాడాలో చెప్పి కూర్చున్నారు. తరువాత ప్రెసిడెంట్‌గారి బావ మరిది కవితలాంటిది వత్తుతూ... చదివి విని పించాడు. దాని అర్థం ఎవరికీ తెలియలేదు.

ఆ తరువాత ప్రబుద్ధుడుగారు లేచి శ్రీ రామ బాణంగారి పాండిత్య పటిమ గురించి పద్యాల తో సహా అరగంటసేపు ఆవేశంగా మాట్లాడారు. ఆవేశం తగ్గి, ఆయాసం పెరగడంతో కూర్చోబో యారు!

విషయం గ్రహించిన మోహనరావు ఒక్క సారిగా కుర్చీలోంచి లేచాడు. సింగిల్ రన్‌కోసం పరిగెట్టే క్రికెట్ ఆటగాడిలా వేదిక మీద వేగంగా ప్రబుద్ధుడుగారి దగ్గరికి వెళ్లాడు. జాలిగా ఆయ న మొఖంలోకి చూసాడు "అసలు నిన్ను ఎందు కు పిలిచాను, ఎందుకు వచ్చావో గుర్తుచేసు కో..." అన్నట్టుగా! మోహనరావు అలా జాలిగా తనవైపు ఎందుకు చూసాడో అర్థంచేసుకున్నారు ప్రబుద్ధుడుగారు.

తను ఆవేశంలో రామబాణం గారి గురించి మాట్లాడాడుగానీ, మోహనరావు రచించిన పుస్తకం గురించి సమీక్షించడం మర్చిపోయినం




దుకు రవంత సిగ్గుపడ్డాడు.

"మోహనరావు తనకి పుస్తకం పంపాడు. పనుల వత్తిడి వల్ల తను ఒక్క పేజీ కూడా చదవలేదు. మరి సభకు పుస్తకం గురించి ఏం చెప్పాలి?" ఇలా సాగాయి ఆయన ఆలోచనలు.

వెంటనే తెలివిగా దగ్గు నటిస్తూ, ఆ రెండు నిమిషాల్లో పుస్తకంలోని పేజీలు అక్కడక్కడా చదివేసాడు. మరుక్షణం మోహనరావు తన ప్రియశిష్యుడు అని, మంచి రచయిత అని సభాముఖంగా చెప్పి తెగ మురిసిపోయారు ప్రబుద్ధుడుగారు.

సభనుద్దేశించి పుస్తకంలోని రెండుముక్కలు చెప్పి, "ఇప్పుడు పుస్తక రచయిత మాట్లాడతారు" అన్నారు.

మోహనరావుకి వళ్లు మండిపోయింది. అసలు తన ప్రమేయం లేకుండా, తనని ఒక దిష్టి బొమ్మలా వేదికమీద కూర్చోబెట్టి రాజన్న, సుబ్బారావులు ఇలా పేట్రేగిపోవడం అతనికి నచ్చలేదు. అయినా తను మాట్లాడాలి కనుక మైకు ముందుకు వచ్చాడు.

"సభకు నమస్కారాలు! నేటి నా పుస్తక ఆవిష్కరణ సభ చూడముచ్చటగా వుంది. ఎందుకంటే నేను గతంలో కొన్ని సాహితీ సభలు చూసాను! హాలు జనంతో నిండి, సభ జనరంజకంగా వుండేది. కానీ చిత్రం ఏమిటంటే దానికి భిన్నంగా వుంది ఈ సభ. వచ్చిన ప్రేక్షకులకన్నా వేదిక నలంకరించిన వ్యక్తులు ఎక్కువగా ఉన్నారు. అంచేత ఒక్కమాటలో చెప్పాలంటే 'వేదిక జన రంజకంగా ఉంది!'". ఇంత చక్కని సాహితీ సభ ఏర్పాటు చేసిన మలయమారుతం సాహితీ సంస్థ ప్రముఖులు, రథసారధులూ అయిన శ్రీ రాజన్న, శ్రీ సుబ్బారావు గార్లకు నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను" అంటూ దిగాలుగా వేదిక దిగాడు రచయిత మోహనరావు.

"ఇది పుస్తకావిష్కరణ సభ కాదు! స్వయంకృత పుస్తకావిష్కరణ సభ!! అనుకున్నాడు బాధగా మనసులో.